

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం,26 మే 2025

8 పేజీలు


### సత్యవాడలో
## వైద్య శిబిరం ఏర్పాటు





- అప్రమత్తమైన వైద్య ఆరోగ్యశాఖ
- ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్యంపై ఆరా
- మంత్రి సుభాష్, కలక్టర్ ఆదేశాలతో చర్యలు

**కె.గంగవరం,మేజర్‌న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం సత్యవాడ గ్రామంలో కరోనాకేసు నమోదు అవ్వడంతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి దుర్గారావుదొర ఆదేశాల మేరకు రామచంద్ర పురం సబ్ డివిజనల్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంతి, పామర్రు ప్రభుత్వాసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పోలిశెట్టి హర్షిత, డాక్టర్ పసుపులేటి విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. సత్యవాడ గ్రామానికి చెందిన సలాది వెంకట్రావుకు కరోనాపాజిటివ్ నిర్ధారణ కావడంతో శనివారమేస్థానిక వైద్యాధికారులు అప్రమతమై గ్రామ సచివాలయ సిబ్బందితో పారిశుధ్య పనులునిర్వహించారు.ప్రజలు భయాందోళనకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.ఆదివారంఉదయం సచివాడ గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి ప్రజలను పరీక్షించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.అనంతరంప్రతిఇంటికివెళ్లి ప్రజల ఆరోగ్యంపై ఆరాతీసి, పలు సూచనలు చేశారు. ప్రస్తుతం దేశంలోనూ, రాష్ట్రంలోనూ అక్కడక్కడ కరోనా కేసులు నమోదు అవుతున్న తరుణంలో

- తరువాయి 2లో..

### యోగాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో
## ప్రజలందరిని భాగస్వాముల్ని చేస్తాం

- మే 27 సెంట్రల్ జైలులో రాష్ట్ర స్థాయి కార్యక్రమం
- నాలుగు పర్యాటక ప్రదేశాల్లో జూన్ 1,7,14,20 తేదీల్లో యోగాంధ్ర ప్రచార కార్యక్రమాలు
- జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

**రాజమహేంద్రవరం, మేజర్‌న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లాలోయోగాంధ్ర ప్రచార కార్యక్రమాల నిర్వహణకు యోగాంధ్ర క్యాలెండర్ విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారంఒకప్రకటనలో తెలియ చేసారు. ఇందులో భాగంగా 26వ తేది సోమవారం నుంచి వచ్చే నెల 20 వరకు జిల్లాలో ఒక్కో రోజు ఒక్కో రంగం వారితో యోగా కార్యక్రమాలు జరిగేలా ప్రణాళికరూపొందించినట్లు చెప్పారు..'యోగాంధ్రప్రదేశ్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన క్యాలెండర్ను అనుసరించి ఈ ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. సుశిక్షితులైన యోగా గురువుల ప్రత్యక్ష పర్యవేక్షణలో యోగాభ్యాసం ఉంటుందని తెలిపారు. జూన్ 21న విశాఖలో జరిగే అంతర్జాతీయ యోగా వేడుకకు ప్రధాని నరేంద్రమోదీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరు కానున్నట్లు తెలిపారు.

**తూర్పుగోదావరి జిల్లా షెడ్యూల్‌లో ప్రత్యేక కార్యక్రమాలు :**

యోగా నేర్చుకున్న వారితో మే27న తూర్పు గోదావరి జిల్లాలోని కేంద్ర కారాగారం, జైళ్లలో రాష్ట్ర స్థాయి కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం




ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు. తూర్పు గోదావరి జిల్లాలోని 4పర్యాటక ప్రదేశాల్లో కూడా యోగా సాధన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. అందులో భాగంగా జూన్ 1ఆదివారం నాడు సరస్వతి ఘాట్ వద్ద, జూన్ 7 శనివారం సత్యదేవ నర్సరీ, కడియంలో, జూన్ 14వ తేదీ శనివారం కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో, జూన్ 20

- తరువాయి 2లో..

### రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థుల
## సేవలు ఆదర్శనీయం

- ఎమ్మెల్యే వనమాడి



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** రెడ్ కాన్వెంట్ పూర్వ స్టూడెంట్స్ సేవలు అభినందనీయమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) అన్నారు. రెడ్ కాన్వెంట్ లేకపోయినా ఆనాడు విద్యను అభ్యసించిన విద్యార్థులంతా కలిసి ఒక ట్రస్ట్‌గా ఏర్పడి విద్యా, వైద్య, ఉపాధి వంటి రంగాలకు ఉచిత సేవలు, సహాయం చేయడం పట్ల వనమాడి సంతోషం వ్యక్తం చేశారు. ఆదివారం డాక్టర్ బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్ ఆవరణలో గల రెడ్ కాన్వెంట్ స్టూడెంట్స్ (1978) ఛారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ఒక దివ్యాంగునికి 3చక్రాల సైకిల్ (ట్రై సైకిల్), స్వయం ఉపాధి పథకంలో భాగంగా నలుగురు మహిళలకు కుట్టు మిషన్లు, ముగ్గురు విద్యార్థులకు సైకిళ్లను ఎమ్మెల్యే కొండబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈసందర్భంగా కొండబాబు మాట్లాడుతూ రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థులు కాకినాడ, పరిసర ప్రాంత ప్రజలకు అందిస్తున్న

- తరువాయి 2లో..



### మిరియాల అప్పారావు సేవలకు గుర్తింపుగా
## పద్మశ్రీ వరించింది

- ఎమ్మెల్యే సత్యానందరావు

**రావులపాలెం,మేజర్‌న్యూస్ :** కళాకారుల రంగంలో తను చేసిన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారం మిరియాల అప్పారావుకు వరించిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కొనియాడారు. రావులపాలెం ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగిన మిరియాల అప్పారావుసంస్మరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే సత్యానంద రావు హాజరయ్యారు.ఈసందర్భంగా అప్పారావు తనకు తెలిసిన కళనుప్రదర్శించి ఎందరో అభిమానంసంపాదించుకున్నారన్నారు. అంతే కాక ఆయన నేర్చుకున్న కళను ఎందరికో నేర్పి వారిని కళాకారులుగా తీర్చిదిద్దిన ఘనత అప్పారావుకు దక్కుతుందని

- తరువాయి 2లో..

### సినీ పరిశ్రమ వివాదాల్లోకి లాగొద్దు...
## థియేటర్ల బంద్‌తో సంబంధం లేదు

- ఆరోపణలు వద్దు..ఆధారాలు చూపించండి
- మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన హరిహర వీరమల్లు చిత్రం విడుదల కాకుండా తనతోపాటు కొంతమంది సినీ నిర్మాతలు కుట్రపన్నారంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని కాకినాడ సిటీ మాజీ శాసన సభ్యులు ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.జూన్ 1వ తేదీ నుంచి సినిమా థియేటర్లు బంద్ చేయాలన్న ప్రతిపాదన సినీ పరిశ్రమ, థియేటర్ యజమానులు, ఎగ్జిబిటర్లకు సంబంధించిన అంతర్గత వ్యవహారమని ద్వారంపూడి పేర్కొన్నారు. ఆ అంశంతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన చెప్పారు. పూర్తిగా సినీ పరిశ్రమకు సంబంధించిన ఈ వ్యవహారంలో నిర్మాతల మండలి ప్రతినిధి నట్టి కుమార్ చేసిన వ్యాఖ్యలను ఏమాత్రం ధృవీకరించుకోకుండా కొన్నిమీడియా సంస్థలు అనవసరంగా తనపేరును వాడివివాదం సృష్టిం చేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.ఈ వివాదంలో తన పాత్రపై ఏమైనా ఆధారాలు ఉంటే చూపించి విమర్శలుచేయాలని ఆయన హితవుపలికారు.నిజనిర్ధారణ చేసుకోకుండా సినీ పరిశ్రమ వివాదంలోకి తనను

- తరువాయి 2లో..

# డ్రైన్లు తవ్వకాలను పరిశీలించిన ఇరిగేషన్ నీటి సంఘం ప్రతినిధులు



**ఆలమూరు, మేజర్‌న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలో జరుగుతున్న మురుగునీటి కాలువల తవ్వకాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఆలమూరు సాగునీటి డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి ఆధ్వర్యంలో నర్సిపూడి మీడియం డ్రైన్ తవ్వకాలు గతవారం రోజులుగా సాగుతున్నాయి. పంట భూముల్లోని మురుగునీరు సక్రమంగా వెళ్లేందుకు మీడియం డ్రైన్ తవ్వకాలు చేయాలని ప్రతిపాదనలో భాగంగా నర్సిపూడి మీడియం డ్రైన్ కు నీటిపారుదల సేకరించి రూ 17 లక్షలు నిధులు కేటాయింపు చేశారు. దీంతో డ్రైన్ తవ్వకాలు చేపట్టారు.నర్సిపూడి మీడియం డ్రైన్ తవ్వకాలను ఆదివారం నీటిపారుదల శాఖ డ్రైన్స్ విభాగం డిప్యూటీ ఇంజనీర్ పోచారావు, ఏమి సుబ్రహ్మణ్యం, చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్ చౌదరి పరిశీలించారు. అనంతరం జొన్నాడ– పెనికేరు డ్రైన్ తవ్వకాలు చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్ చౌదరి ఆధ్వర్యంలో జరుగుతున్న తవ్వకాల పనులనుఅధికారులుపోచారావు సుబ్రహ్మణ్యం పరిశీలించారు. రైతులు, నీటి సంఘం అధ్యక్షుడు గారపాటిల సహకారంతో చేపట్టిన ఈ తవ్వకాలు ప్రభుత్వ నిధులు మంజూరు చేయడానికి కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు.

## ముప్పు వాటిల్లకముందే

# చర్యలు తీసుకోవాలి..

### - మెర్లపాలెంలో పొంచి వున్న ప్రమాదం





**ఆత్రేయపురం, మేజర్‌న్యూస్ :** ఎన్నో ఏళ్ల నుండి కాలం చెల్లిన కరెంట్ స్తంభాలతో ప్రమాదం పొంచి వుందని ముప్పు వాటిల్లకముందే చర్యలు తీసుకోవాలని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని మెర్లపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల వద్ద కరెంట్ ఐరన్ పోల్ తుప్పు పట్టి ఉండడంవల్ల పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. పాఠశాల భవనం వద్ద ఉన్న కరెంటు స్తంభం కావడంతో ఏ సమయంలో అయినా కరెంట్ స్తంభం కూలితే విద్యార్థుల ప్రాణాలకు సైతం ప్రమాదం పొంచి ఉన్నందున తుప్పు పట్టిన కరెంటు స్తంభాన్ని తొలగించి విద్యుత్తు లైను సరిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రస్తుతం వేసవి సెలవులు అమలులో ఉన్నందున పాఠశాలలు తిరిగి పునఃప్రారంభించే లోపు తుప్పు పట్టిన కరెంటు స్తంభాన్ని తొలగించాలని గ్రామస్తులు ట్రాన్స్కో అధికారులను కోరుతున్నారు.

## సూర్య గ్లోబల్ హాస్పిటల్ వారిచే ఉచిత వైద్య శిబిరం





**కాకినాడ రూరల్, మేజర్‌న్యూస్ :** స్థానిక రమణయ్యపేట బోట్ క్లబ్ ప్రాంగణంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటుచేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్లు బిపి, షుగర్ సంబంధించి రక్త పరీక్షలు చేసి డాక్టర్ల పర్యవేక్షణలో ఉచితంగా మందులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సుమారుగా 200 మంది పాల్గొని ఉచిత వైద్య సేవలు పొందారు.వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్,రెడ్యంరాజా, రాయుడు అనిల్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు చిత్రలేఖనంపై పోటీలు



**పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం ప్రథమశ్రేణి శాఖాగ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి పాలంకి నాగరాజు ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు వేసవి విజ్ఞాన తరగతులలో భాగంగా చిత్రలేఖనంపై పోటీలు నిర్వహించడం జరిగింది. అలాగే పుస్తకాలు చదివించడం, కథలు చెప్పడం,జరిగింది. ఈ కార్యక్రమంలో తాడిగడప సుబ్బారావు, రాళ్ళపల్లి వెంకటేశ్వరరావు, గ్రంథాలయ సిబ్బంది సింగం బుల్లియ్య, విద్యార్థులు, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

## మిరియాల అప్పారావు సేవలకు గుర్తింపుగా పద్మశ్రీ వరించింది

మొదటిపేజీ తరువాయి

ఎమ్మెల్యే సత్యానందరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కుడుపూడి శ్రీనివాసరావు, గుత్తులపట్టాభి రామారావు,శిల్పిరాజ్‌కుమార్ వుడయార్, నందం సత్య నారాయణ, పడాల బులి కొండారెడ్డి, పద్మశ్రీ మిర్యాల అప్పారావు కుటుంబ సభ్యులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# వంతాడలో లేటరైట్ క్వారీ మైనింగ్‌లో ఇద్దరు మృతి



**ప్రత్తిపాడు,మేజర్‌న్యూస్ :** ప్రత్తిపాడు మండలం వంతాడ లేటరైట్ క్వారీలో లారీలు కొండపై నుంచి క్రిందకు మట్టిని తరలించే క్రమంలో క్వారీ లారీలు ఎదురెదురు పడడంతో జరిగిన ప్రమాదంలో లారీ క్యాబిన్లో ఇరుక్కుని బీహార్‌కు చెందిన ధీరజ్, చందన్ ఇరువురు ప్రమాదంలో మృతి చెందారు. సంఘటన జరిగిన వెంటనే ఆస్పత్రికి తరలిస్తే బ్రతికేవారని మృతులు బంధువులు బోరున విలపిస్తున్నారు.నిన్న సాయంత్రం 6 గంటలకు ప్రమాదం జరిగిన వెంటనే ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నాహాస్పిటల్‌కితరలించకుండావైద్యం అందకపోవడంతో యజమాన్యం నిర్లక్ష్యం వలన ప్రాణాలు కోల్పోయారు అంటూ మృతుల బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే ప్రదేశంలో ఎన్నో ప్రమాదాలు జరిగిన అధికారులు గానీ డిపార్ట్మెంట్ కానీ ఎవరు కన్నెత్తి చూడలేని పరిస్థితి ఉందని,రాత్రింబవలు వందల్లో లారీలు విచ్చలవిడిగా తిరుగుతున్న పట్టించుకునే నాధుడులేరని, వంతాడ లాటరైట్ మైనింగ్‌లో ఎన్నో ప్రమాదాలు జరిగిన గుట్టుచప్పుడు లేకుండా చేస్తున్న యజమాన్యం అని ప్రజలు ఆరోపిస్తున్నారు.

# సత్యవాడలో వైద్య శిబిరం ఏర్పాటు

మొదటిపేజీ తరువాయి



ప్రతి ఒక్కరూ వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకుని కరోనా వైరస్ నిర్మూలన కు సహకరించాలని కోరారు. సామాజిక దూరంపాటించడం ,మాస్కులు ధరించడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, పెద్ద ఎత్తున గుంపులు గుంపులుగా ఉండకుండా జాగ్రత్త పడటం, 60 ఏళ్లు దాటిన వాళ్ళు ఇళ్లలోనే ఉండాలని పలు సూచనలు చేశారు.దగ్గటం,తుమ్మటం వంటివి చేసిన వ్పుడు చేతిని అడ్డుపెట్టుకోవడం,చేతులనుసబ్బుతోశుభ్రం చేసుకోవడం తదితర జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కరోనా నిర్ధారణ అయిన సలాది వెంకట్రావుకాకినాడ ప్రభుత్వఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఆరోగ్యంగా ఉన్నారని,ప్రజలు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ వైద్య శిబిరంలో గ్రామ సర్పంచ్ సలాది సూర్యకళావతి, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యోగాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో ప్రజలందరిని భాగస్వాముల్ని చేస్తాం

మొదటిపేజీ తరువాయి

శుక్రవారం నగరవనంలో యోగ కార్యక్రమాలు జరుగుతాయని కలెక్టర్ ప్రశాంతివెల్లడించారు.అంతర్జాతీయయోగా దినోత్సవం సందర్భంగా యోగాపై పోటీలు నిర్వహించి జిల్లాస్థాయి విజేతలు విశాఖ కార్యక్రమానికిహాజరయ్యేలాచర్యలుతీసుకుంటున్నా మన్నారు.

**కేంద్ర కారాగారంలో రాష్ట్రస్థాయి యోగాకార్యక్రమఏర్పాట్లపరిశీలన:** యోగాంధ్ర ప్రచార కార్యక్రమంలో భాగంగారాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని రాజమహేంద్రవరంకేంద్ర కారాగారంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు పేర్కొన్నారు.ఆదివారం సెంట్రల్‌జైలు సూపరింటెం డెంట్ ఎస్.రాహుల్‌తో జూన్ 27వతేదీ మంగళవారం కార్యక్రమ ఏర్పాట్లు విషయమై జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సూచనలను అనుసరించి క్షేత్ర స్థాయిలో చర్చించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో కృష్ణ నాయక్, ఇతర జైళ్ల అధికారులు పాల్గొన్నారు.

## రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థుల

# సేవలు ఆదర్శనీయం

మొదటిపేజీ తరువాయి

సేవలు మరువలేవని, వీరిని స్ఫూర్తిగా తీసుకొని సేవలను ఇంకా విస్తృత పరచాలని ఎమ్మెల్యే వనమాడి ఆకాంక్షించారు. ఈ సేవలను కాకినాడ ప్రజలు, ప్రభుత్వం గుర్తుంచుకుంటారన్నారు. వీరి సేవలు విస్తృత పరిచే విధంగా కాకినాడలో ఒక స్థలాన్ని ప్రభుత్వం తరుపున అందించేందుకు సహకరిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. ట్రస్ట్ అధ్యక్షుడు బాదం బాలకృష్ణ మాట్లాడుతూ మా పూర్వ విద్యార్థులు అందరూ ప్రస్తుత సమాజావసరాలకు తగినట్టుగా సేవా కార్యక్రమాలు చేయడానికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. ట్రస్టు సేవలకు స్థలం అందించేందుకు సహకరిస్తానని చెప్పిన ఎమ్మెల్యే వనమాడికి బాదం కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ట్రెజరర్ డివిఆర్ జగన్నాథం. సీమకుర్తి పాపారావు, తాళ్ళూరి శ్రీనివాస రాజు, వేదుల మధు, టి పద్మనాభం, వివి రామ్ చరణ్, కుమార్, ఎం జనార్ధన్, టి సత్య శ్రీనివాసరావు, ఆకుల సరళ తదితరులు పాల్గొన్నారు.

## సినీ పరిశ్రమ వివాదాల్లోకి లాగొద్దు...

## థియేటర్ల బంద్‌తో సంబంధం లేదు

మొదటిపేజీ తరువాయి

లాగడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఇటీవలి కాలంలో సినీ పరిశ్రమకు చెందిన ఏ ఒక్కరిని తాను కలవలేదని ఆయన స్పష్టం చేశారు. చేసిన ఆరోపణలు రుజువు చేయగలరా? అని ద్వారంపూడి నిలదీశారు.

రాజకీయాల్లో ఉన్నాననే అక్కస్సుతో ఏదో ఒక వివాదంలోకి లాగి తప్పుడు విమర్శలు చేయడం, అబద్ధాన్ని నిజం చేసేలా పదేపదే ప్రసారం చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. జూన్ 1వ తేదీ నుంచి థియేటర్ల బంద్‌కు సంబంధించిన అంశంతో సహ ఏ ఒక్క సినీ పరిశ్రమ వివాదంలో తన పాత్ర లేదని ద్వారంపూడి మరోసారి స్పష్టం చేశారు. నిరాధారమైన ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని ద్వారంపూడి హెచ్చరించారు.

# సేంద్రీయ వ్యవసాయ విధానం సురక్షితం





–భూతాపాన్ని తగ్గించవచ్చు...
భవిష్యత్ తరాల వారిని రక్షించవచ్చు

– ఆరోగ్యకర సమాజానికి దోహదపడవచ్చు – విజయరామ్

**కాకినాడ,మేజర్‌న్యూస్** : ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన పంటలు మరియు పండ్లను పండించడం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని రక్షించినవారు అవుతామని ప్రకృతి వ్యవసాయ ప్రచారకులు మరియు సేంద్రియ నిపుణులు ఎం.విజయరామ్ అన్నారు. ప్రకృతి రాగా సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రక ృతి వ్యవసాయ అవగాహన సదస్సు స్థానిక దంటు కళాక్షేత్రంలో ఆదివారం జరిగింది .ముఖ్య అతిథిగా విజయరామ్ పాల్గొని మాట్లాడుతూ భవిష్యత్ తరాలు రోగాల భారీనపడకుండా ఉండాలంటే ప్రకృతి వ్యవసాయమే పరిష్కార మార్గమని అందునా సేంద్రియ వ్యవసాయ విధానం ముఖ్యమన్నారు. దీనివల్ల రసాయనాలు వినియోగం లేని పంట ఉత్పత్తులను చేయడం వల్ల సమాజంలో ఆరోగ్యకరమైన ఆహారాన్ని ప్రజలు స్వీకరించడానికి అవకాశం ఉంటుందన్నారు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయం కూడా చాలా అవసరమని దీనిలో అనేక విధమైన పోషకాలు లభ్యమవుతాయని ఆయన వివరించారు. పశుసంపదను రక్షించుకోకపోతే మానవాళికి భవిష్యత్తు ఉండదని హెచ్చరించారు. రాత్రి సమయాల్లో పశువులను లారీలలో తరలిస్తున్నారని వాటిని అడ్డుకోవలసిన బాధ్యత మనందరి పైన ఉందన్నారు ,ఎవరికీ భయపడవలసిన అవసరం లేదన్నారు. ఈ విషయంలో కెప్టెన్ మల్లికార్జునరావు దంపతులు చూపించిన ప్రత్యేక శ్రద్ధ నన్ను ఆకట్టుకుందని విజయరామ్ చెప్పినప్పుడు సభలో కరతల ధ్వనులతో సభికులు హర్షాన్ని వ్యక్తం చేశారు. పశుసంపదను వృద్ధి చేయవలసిన బాధ్యత మనందరి పైన ఉందని ఆయన అన్నారు. కెప్టెన్ మల్లికార్జున రావు దంపతులు నందిని నీ కొనుగోలు చేశారని దీని ద్వారా శ్రేష్టమైన పశు సంపద వృద్ధి చెందేందుకు ఎంతో ఆస్కారం ఉందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం పట్ల ఈ ప్రాంత రైతులకు ప్రజలకు ఉన్న అభిమానాన్ని స్వయంగా చూడాలన్న తపనతో కాకినాడకు రావడం జరిగిందని విజయరామ్ చెప్పారు. ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత వ్యవసాయ విధివిధానాలు గోమాత విశిష్టత గురించి కూడా సమగ్రంగా వివరించారు. భూసమతుల్యత వైవిధ్యం కాపాడుకోవడం మనందరి సమిష్టి బాధ్యత విజయరామ్ అన్నారు. పద్మశ్రీ సుభాష్ పాలేకర్ కృషి వ్యవసాయ విధానంలో బయట నుండి ఎరువులు, పురుగుల మందులు, కలుపు మందులు కొనే అవసరం ఉండదని ఆయన స్పష్టం చేశారు. గ్రామీణ వికాసం కోసం ప్రస్తుతం మూస పద్ధతిలో వ్యవసాయం చేస్తున్నారని దీనివల్ల భూతాపం పెరిగిపోతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భూతాపం తగ్గించేందుకు ఐదు అంచుల వ్యవసాయ విధానాన్ని ఆయన వివరించిన తీరు అందరిని ఆకట్టుకుంది. ఈ విధానంలో అయిదు దశలలో అంతర్ పంటలను ప్రోత్సహించడం ద్వారా రైతుకు ఎంతో మేలు చేకూరుతుందని చెప్పారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతులను ఆచరణలోకి తీసుకురావడమే కాక దానిని ప్రత్యక్షంగా ఫలితాలను చూపించడం జరిగిందని వివరించారు. రైతులను ఈ పద్ధతులలో వ్యవసాయం చేయడానికి ప్రోత్సహిస్తే అద్భుతమైన ఫలితాలను పొందగలమని ఆయన తెలిపారు. తాను పద్మశ్రీ సుభాష్ పాలేకర్ ప్రకృతి వ్యవసాయ విధానాన్ని అనుసరిస్తూ దాని ప్రయోజనాలను రైతులకు వివరించడానికి తెలుగు రాష్ట్రాలలో అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నానని విజయరామ్ చెప్పారు. ప్రకృతి వ్యవసాయం వల్ల రైతులు అనేక లాభాలు పొందవచ్చని దీని ద్వారా రైతు ఆరోగ్యంతో పాటు ప్రజా ఆరోగ్యాన్ని రక్షించిన వారవుతామని, సేంద్రీయ వ్యవసాయ విధానంపై అందరూ దృష్టి పెట్టాల్సిందిగా ఆయన కోరారు. తక్కువ సమయంలో అధిక ఉత్పత్తుల కోసం రసాయనిక మరియు ఎరువుల వినియోగం వల్ల ప్రయోజనాల కన్నా హానికరమైన ఉత్పత్తుల ద్వారా మానవాళికి మరియు భూమాతకు ద్రోహం చేసిన వారు అవుతామని ఆయన హెచ్చరించారు .దేశీయ విత్తనాలను ఉపయోగించి ప్రక ృతి వ్యవసాయం చేయడం ద్వారా రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రకృతి వ్యవసాయం అనేది రసాయన ఎరువులు, పురుగు, మందులు, కలుపు మందులు లేకుండా సహజ పద్ధతులలో పంటలు పండించే ఒక విధానం అని, ఈ పద్ధతిలో ఆవుల పేడ, మూత్రము, ఆకు తుక్కు మరియు వర్మీ కంపోస్ట్ వంటి సహజ పదార్థాలను ఉపయోగించడం ద్వారా అధిక పంటలను పొందగలమన్న విషయాన్ని తన వ్యవసాయ క్షేత్రంలో నిరూపించి చూపించానని విజయరామ్ స్పష్టం చేశారు. తన వ్యవసాయ విధానం ద్వారా ప్రజలకు కలుగుతున్న అనేక ప్రయోజనాలను ప్రచారం చేయడంలో ప్రసార మాధ్యమాలు ప్రత్యేక దృష్టి పెట్టడం పట్ల ఆయన హర్షాన్ని వ్యక్తం చేస్తూ ఇటువంటి ప్రజా ప్రయోజన ఆహార ఉత్పత్తుల తాలూకు విషయాలను ప్రజలకు ఎప్పటికప్పుడు అందించడంలో ప్రసారమాధ్యమాలు దృష్టి పెట్టడం శ్రేయస్కరమని విజయరామ్ కోరారు. భవిష్యత్ తరాలు వారు ఆరోగ్యంగా ఎదగాలన్న జీవించాలన్న సేంద్రియ వ్యవసాయం ప్రధానమని ఆయన పలు అంశాలను వివరించారు. వ్యవసాయ అనుకూల భూములన్నీ రక్షించడం మనందరి ప్రాథమిక కర్తవ్యం అని, లేనియెడల భూమి కలుషితమై భూతాపం పెరిగి ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవలసి వస్తుందని ఆయన హెచ్చరించారు. సేంద్రియ వ్యవసాయ విధానం ద్వారా గ్రామీణ వికాసం, ఆరోగ్యకరమైన పట్టణాల మనుగడ సాధించేందుకు ఎక్కువ అవకాశం ఉంటుందని విజయరామ్ అభిప్రాయపడ్డారు. మనం చేసే ప్రతి చర్యకు దాని ఫలితాలను మనమే అనుభవించాల్సి ఉంటుందని, అంతేకాకుండా దాని ఫలితాలు భవిష్యత్తు తరాల వారికి ప్రమాదకరంగాను మారితే దానికి బాధ్యులు మనమన్న విషయం మరిచిపోకూడదని విజయరామ్ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

## అనాధ ముస్లిం యువతి వివాహానికి

# ఆయుర్వేద వైద్యులు రూ20 వేలు ఆర్థిక సహాయం



**ఎటపాక,మేజర్‌న్యూస్** : తల్లితండ్రిలను చిన్నతనంలో కోల్పోయి అనాధగా పెరిగిన సనఅనే ముస్లిం యువతి నిఖాకు ప్రముఖ ఆయుర్వేద వైద్యులు, జెకెసిటి ట్రస్ట్ చైర్మన్ మహమ్మద్ జమాల్ ఖాన్ ఆదివారం రూ.20,000 అందజేశారు. బూర్గంపహాడ్ మండలం గౌతమ్‌పూర్ కాలనీకి చెందిన షేక్ హమీద్ కుమార్తె సనా నిఖా వివాహము జూన్ రెండవ తేదీన జరుప నిశ్చయించినారు. పెళ్లి ఖర్చులకు గాను జమాల్ ఖాన్‌ను సహాయం కోరగా తన ట్రస్ట్ ద్వారా ఆమెకు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జెకె సెట్ సభ్యులు ఎండి జావేద్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత మెగా డీఎస్సీ ఎస్‌జిటి మోడల్ టెస్ట్ నిర్వహణ

**కాకినాడ,మేజర్‌న్యూస్** : విద్యుత్ నగర్ శ్యామ్ ఇనిస్ట్యూట్ నందు ఆదివారం డీఎస్సీ ఎస్‌జిటి ఎస్ ప్రేయర్మెంట్‌కి ఉచిత మెగా గ్రాండ్ డీఎస్సీ ఎస్‌జిటి మోడల్‌టెస్ట్ జరిగింది. యంగ్‌మైండ్స్,శ్యామ్ ఇన్స్టిట్యూట్, పిఆర్‌టియు ఏపీవారు సంయుక్తంగా నిష్ణాతులైన ఉపాధ్యాయులతో ఈమోడల్ టెస్టును రూపొందించి నిర్వహించడమైనది. ఈటెస్ట్ రాసేందుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుండి మరియు ఇతర జిల్లాల నుండి అనూహ్యమైన రీతిలో విద్యార్థులు హాజరై ఈ పరీక్షను రాయడం జరిగిందని యంగ్ మైండ్స్ అధ్యక్షులు వాకాడ వెంకటరమణ (చిన్న మాస్టర్) తెలియజేశారు. పిఆర్‌టియు కాకినాడ జిల్లా అధ్యక్షులు చింతాడ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ ఈ పరీక్షకు హాజరైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ ఈ పరీక్ష రాయడం వలన వారు ఏ చాప్టర్లో వీక్‌గా ఉన్నారో అంచనా వేసి సరిదిద్దుకోవడానికి ఈ మోడల్ పరీక్ష ఎంతగానో దోహదం చేస్తున్నది తెలిపారు. ఈ పరీక్షకు 566 మంది హాజరయ్యారని తెలిపారు. కీని వెంటనే ఇవ్వడం జరిగిందని తెలిపారు. శ్యామ్ ఇనిస్టిట్యూట్ కాకినాడ శ్యామ్ మాట్లాడుతూ ఈ పరీక్ష పేపరు



ప్రఖ్యాతిగా నిర్వహించే పరీక్షకు నమూనా వంటిదని 28న రాష్ట్రవ్యాప్తంగా ఆన్లైన్ పరీక్ష నిర్వహిస్తామని శ్యామ్ ఇనిస్టిట్యూట్ ఆచార్య ఏపీపీ ని డౌన్లోడ్ చేసుకుని ఈ పరీక్షను వ్రాయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్యాం సీఈఓ శ్రీనివాస్, నేషనల్ అవార్డు తోటకూర సాయి రామకృష్ణ, ఏజీవి సుబ్బారావు, వి.మనోహర్, ఏవి రమణ, సిహెచ్ రాజవరహాలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పేద కుటుంబానికి ఆర్థిక తోడ్పాటు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

– ఉచిత కుట్టు మిషన్ల (టైలరింగ్) సెంటర్‌ను ప్రారంభించిన శాసనసభ్యులు వనమాడి కొండబాబు



**కాకినాడ,మేజర్‌న్యూస్** : ప్రతి పేద కుటుంబానికి ఆర్థిక తోడ్పాటు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబుపేర్కొన్నారు. స్థానిక జగన్నాధపురం తూరంగపేట నందు ఆదివారం ఆంధ్రప్రదేశ్ వెనకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్లశిక్షణా(టైలరింగ్)సెంటర్ను శాసనసభ్యులు వనమాడి కొండబాబు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబంలోని మహిళలకు కుట్టు మిషన్ల శిక్షణ ఇచ్చి వారికి ఉచితంగా కుట్టు మిషన్లు అందచేసి వారి ఆర్థిక తోడ్పాటుకు కృషి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, చంద్రబాబు నాయుడు సారథ్యంలో మహిళల ఆర్థిక తోడ్పాటుకు అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో బొడ్డు శివాజీ, కోనాడ ప్రకాష్, చవ్వాకుల రాంబాబు, బడే ఆనంద్, గొరుసు దుర్గారావు, చింతపల్లి తాతారావు,అంగాడిదుర్గారావు, ఓలేటి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# 11వ రోజుకు చేరిన ఆదివాసీల రిలే నిరాహార దీక్షలు




**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం చెయ్యాలని ఆదివాసీ జేఏసీ చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 11వరోజుకు చేరుకున్నాయి. ఆదివాసీల దీక్షలకు ఏజెన్సీ గిరిజన సంఘం నాయకులు ఆదివారం సంపూర్ణ మద్దతు తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం ముందు 11వ రోజు రిలే నిరాహార దీక్షలు కార్యక్రమానికి ఆదివాసి జేఏసీ కోర్ కమిటీ సభ్యులు కంగల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. రిలే నిరాహార దీక్షలకు హాజరైన ఆదివాసీలకు పూలమాలలు వేసి దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు నాయకురాలు, కొండమొదలు గ్రామ పంచాయితీ సర్పంచ్ వేట్ల విజయ మాట్లాడుతూ 2025 మెగా డీఎస్సీ నుండి షెడ్యూల్డ్ ప్రాంత ఆదివాసీ టీచర్స్ పోస్టులు మినహాయించి, తక్షణమే 100శాతం స్థానిక ఆదివాసీ పట్టభద్రులతో భర్తీ చేసేందుకు ఆదివాసీ ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ (టిఏసి) ఏర్పాటు చేసి తక్షణమే తీర్మానం చేసి షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించాలని, జీవో నెంబర్ 3కు చట్టబద్ధత కల్పిస్తామని ఎన్నికల ముందు అరకులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివాసీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని కోరారు. అలాగే వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేయాలని, రాష్ట్రంలో ఐటిడిఏలు ద్వారా ట్రైకార్ రుణాలు నిరుద్యోగ యువతకు తక్షణమే మంజూరు చేసి ఉపాధి కల్పించాలని మొదలైన సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జేఏసీ తలపెట్టిన రిలే నిరాహార దీక్షలకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామన్నారు. అలాగే ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా నాయకులు వంజం జోగారావు మాట్లాడుతూ ఆదివాసీలకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం భారత రాజ్యాంగంలోని ఐదవ, ఆరవ షెడ్యూల్డ్ లోని భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 244(1) ప్రకారం షెడ్యూల్డ్ ప్రాంతంలో ఉన్న ఆదివాసీ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పేరా–4 ప్రకారం (టి.ఏ.సి) ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ కమిటీ ఏర్పాటు చేసి షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించి ఆదివాసీ నిరుద్యోగ పట్టభద్రుల భవిష్యత్తును కాపాడాలని టి.ఏ.సి కమిటీ సభ్యులను, ప్రజా ప్రతినిధులను, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రిలే నిరాహార దీక్షలు కార్యక్రమంలో వేట్ల లక్ష్మణ్ రెడ్డి, వేట్ల సత్యనారాయణ రెడ్డి, వేట్ల బాబురావు రెడ్డి, నడిపూడి సంజీవ్ రెడ్డి, కొట్టేటి సుబ్బా రెడ్డి, పండా పవన్ కుమార్ దొర, మడకం వీర వెంకట వరప్రసాద్ దొర, చవలం శుభకృష్ణ దొర, ఆదివాసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్, కారం రామన్న దొర, యలగాడ నాగేశ్వరరావు, పొడియం పండు దొర మొదలైనవారు పాల్గొన్నారు.

# జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు




**కాకినాడ,మేజర్‌న్యూస్ :** జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన తరగతులు కార్యక్రమాలు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినీవిద్యార్థులచే ఉదయం 8 గం.ల నుండి 8:30 గం.ల వరకు పుస్తక పఠనం కార్యక్రమం నిర్వహించడం జరిగినది. 8:30 గం.ల నుండి 9:15 గం.ల వరకు డిఆర్‌డిఏ శిక్షణా నిపుణులు ఎం.సత్యబాల విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ ఇవ్వడం జరిగినది. 9:15 గం.ల నుండి 10:00 గం.ల వరకు విశ్రాంత ఉపాధ్యాయురాలు టి.ఎస్.లక్ష్మీ కుమారి విద్యార్థులకు సంగీతం మరియు దేశభక్తి గేయాలపై శిక్షణ ఇవ్వడం జరిగినది. 10:00 గం.ల నుండి 10:10 గం.ల వరకు విద్యార్థినీ విద్యార్థులకు విరామం అల్పాహారం పంపిణీ చేయడం జరిగినది. 10:10 గం.ల నుండి 11:00 గం.ల వరకు విశ్రాంత ఉపాధ్యాయులు బి.సూర్యనారాయణ విద్యార్థులకు స్టూడెంట్ గుడ్ హ్యాండ్ రైటింగ్ కోర్స్‌పై శిక్షణ ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయ అధికారి కె.కిషోర్, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది ఎస్.రాజు, ఎ.వి.ఎస్.నాగేంద్ర కుమార్, జి.దుర్గా ప్రసాద్, వి.అరుణ, కె.ప్రియదర్శిని మరియు స్థానిక పాఠశాలల విద్యార్థిని,విద్యార్థులు 52 మంది పాల్గొనడం జరిగినది.

# 28న శ్రీ స్వామివారి ఆలయంలో వార్షికోత్సవం



**రంపచోడవరం,మేజర్‌న్యూస్:** అల్లూరిసీతారామరాజుజిల్లా రంపచోడవరం మండలం ఐ.పోలవరం గోవింద గిరి పై తిరుమల తిరుపతి దేవస్థానము వారు నిర్మించిన శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ద్వితీయ వార్షికోత్సవం ఈనెల 28న నిర్వహిస్తున్నామని ఆలయ అధికారులు ఆదివారం తెలిపారు. స్వస్తిశ్రీ చంద్రమాన శ్రీ విశ్వావసు నామ సంవత్సర జ్యేష్ఠ శుద్ధ ప్రయుక్త మృగశిర నక్షత్ర మందు ఈనెల 28వ తేది బుధవారం నాడు శ్రీ వేంకటేశ్వర స్వామివారి ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఉదయం 6: 00 గంటలకు సుప్రభాత సేవ, ఉదయం 7:00–8:00 మధ్య తోమాల సేవ, సహస్రనామార్చన, మొదటి గంట, నిత్యపూజా కైంకర్యాలతో ఉదయం 9:00 నుండి మధ్యాహ్నం 12:00 గంటలు నుండి విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచన, అంకురార్పణ,రక్షాబంధనం,అగ్నిప్రతిష్ఠ, కుంభారాధన, విశేష హోమములు, పూర్ణాహుతి, స్వామి అమ్మవార్లకు అష్టోత్తర శత(108) కలశస్నపన తిరుమంజనము,మధ్యాహ్నం 12:00 గం"లకు రెండవ గంట, అక్షతారోపణం,ఆచార్య బహుమానం, సర్వదర్శనం ఉంటుందని దేవస్థానం అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 12: 30గంటల నుండి 2:30 వరకు భక్తులు ఇచ్చిన విరాళములతో శ్రీవారి సేవకుల సేవతో భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు. అదే రోజు సాయంత్రం 5:00 గంటలకు మూడవ గంట నివేదన, సాయంత్రం 5: 30 నుండి 7:00గంటలు వరకు శ్రీ భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారి తిరుకళ్యాణం నిర్వహిస్తారని తెలిపారు. సాయంత్రం 7:00 గంటలకు శ్రీవారి తిరుమాడ వీధి ఉత్సవం (తిరుచ్చి సేవ) రాత్రి 8:00 గంటలకు ఏకాంత సేవతో సంపూర్ణ మవుతుందని ఆలయ అధికారి నారాయణ రాజు, గోవిందగిరి శ్రీవారి సేవా బృందం సమన్వయ కర్త నల్లమిల్లి వెంకట రామారెడ్డి తెలియచేసారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## నేడు కాకినాడలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార (పీజీఆర్ఎస్) వేదిక కార్యక్రమం

**– జిల్లా కలెక్టర్ షణ్మోహన్**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేయబడిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్) కార్యక్రమం జిల్లా స్థాయిలో 26వ తేదీన సోమవారం కాకినాడ కలెక్టరేట్ (గ్రీవెన్స్) హాలులో ఉదయం 10:00 గంటల నుంచి 01:00 గంట వరకు నిర్వహించడం జరుగుతుందని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు. మండల స్థాయిలో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు అందరూ విధిగా ఉదయం 9:30 గంటలకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. అర్జీదారులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి రాలేనప్పుడు, వారి యొక్క అర్జీలను మీకోసం డాట్ ఏపీ డాట్ జీవోవి డాట్ ఇన్ వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. అర్జీదార్లు వారి యొక్క అర్జీల నమోదు మరియు నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం తెలుసుకోవాలి అన్నప్పుడు 1100కి నేరుగా కాల్ చేయవచ్చని కాకినాడ జిల్లా కలెక్టర్ తెలిపారు.

## ట్రెజరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా పాము శ్రీనివాస్



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా పాము శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఆదివారం విజయ వాడలోనే ఏపీఎన్‌జీజీఓ అసోసియేషన్ హోమ్‌లో ఈ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికలలో అధ్యక్షునిగా పాము శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా దేవిశెట్టి రమణారెడ్డి, సహాధ్యక్షులుగా డి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా బి.సుజాత,జి.జగదీష్, టి.ఉదయ భాస్కరరావు, పి.హరిబాబు, పివిఎల్ వరకుమార్,టిఆర్ఎస్‌మురళీధర్ నాయుడు, జే.రవికుమార్, కార్యదర్శులుగా కే.మమత, ఎస్.దివ్యభారతి,ఏ.శ్రీనివాసరావు, బి.అక్కేశ్వరరావు, పి.విశ్వనాధ్,కరుణాకర్,ఎంకె రఘునందన్, కే.కాశీ విశ్వనాథ్, కోశాధికారిగా బొత్స శ్రీనివాసరావు లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా ఏపీ ఎన్‌జీజీవో నాయకులు వి.సి.హెచ్.వెంగళరెడ్డి, సహాయ ఎన్నికల అధికారిగా పి.రమేష్, ఎన్నికల పరిశీలకులుగా కే.జగదీశ్వరరావు వ్యవహరించారు. ఎన్నికల అనంతరం నూతన కార్యవర్గానికి ఏపీ ఎన్‌జీజీఓ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే.వీ.శివారెడ్డి, ఏ.విద్యాసాగర్ అభినందనలు తెలిపారు.

## శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి జాతర పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే



**పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్:** పెద్దాపురంపట్టణంలో వేంచేసి యున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో ది.25–6–2025 నుండి 31–07–2025 వరకు జరిగే ఆషాఢ మాస జాతర మహోత్సవాల పోస్టర్‌ను ఆదివారం పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) కరపత్రాలు, జాతర వాల్‌పోస్టర్‌ను వారి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబురాజు, టిడిపిపట్టణాధ్యక్షులు రంధి సత్యనారాయణ, సామర్లకోట పట్టణాధ్యక్షులు అడబాల కుమారస్వామి, జల్దాని బాబీ, నూనె రామారావు, కొత్తెం కోటి,ఎలిశెట్టినాని,చాగంటి జానకి రామయ్య (బుజ్జి), పలువురు టిడిపి నాయకులు, దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ, సిబ్బంది వెంకటరమణ, ఆసాదులు, వేదపండితులు, తదితరులు పాల్గొన్నారు.


## ఆత్రేయపురం మంచినీటి చెరువులో

# కోడి పెంట వ్యర్థాల వినియోగం





- అనారోగ్యం పాలవుతున్న ఆత్రేయపురం వాసులు
- చెరువు చుట్టూ ప్రభుత్వ కార్యాలయాలే
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం



**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్** : మండల కేంద్రం ఆత్రేయపురంలో అల్లూరి సీతారామరాజు పార్కు, వాకింగ్ ట్రాక్ చెరువును లీజుకు తీసుకున్న సొసైటీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తుందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పార్కు చెరువును మూడు సంవత్సరాల కాలానికి తక్కువ లీజుకు తీసుకున్న ఉమామహేశ్వరి ఫిషర్ మెన్ కో–ఆపరేటివ్ సొసైటీ నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ సబ్ లీజుకు ఇవ్వడంతో చెరువు నిర్వాహకుడు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని విమర్శలు వినిపిస్తున్నాయి. చేపల పెంపకానికి కోడిపెంట వ్యర్థాలను వినియోగిస్తు వుండడడంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు నెల క్రితం చెరువులో గౌరస చేపలు చనిపోయి దుర్వాసనతో గ్రామస్తులు వాసనతో ఎన్నో పాట్లు పడ్డారు. ఈ చెరువులో పెంచిన చేపలను గ్రామ ప్రజలకు తక్కువ రేటు పెట్టి గ్రామంలోనే అమ్మాలి. అయితే పెంచిన చేపలను గ్రామంలో అమ్మకుండా బయటకు పట్టుకెళ్ళి అమ్ముతున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే ఈ చేపలను ఎవరు తింటారండి అని కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారు. 20 రోజుల క్రితం చేపలు పట్టి బయటకు పట్టుకెళ్ళి అమ్ముకున్నారు అలాగే కట్టుగా నార్కెడిమిల్లి గ్రామాలలో కూడా పంచాయతీ చెరువులను చేస్తున్నవారు సబ్ లీజులకు ఇచ్చుకుని సొమ్ములు చేసుకుంటున్నారు. గతంలో ఆత్రేయపురం చెరువులో మంచినీరు త్రాగేవారు. అల్లూరి సీతారామరాజు పార్క్ చెరువు చెంతనే మండల పరిషత్ కార్యాలయము, పోలీస్ స్టేషన్, తాసిల్దార్ కార్యాలయముతో పాటు వివిధ ప్రభుత్వ కార్యాలయాలూ ఉండడంతో నిత్యం వందలాది మంది ప్రజలు వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వస్తుంటారు. అలాగే గ్రామానికి చెందినవారు ఉదయం, సాయంత్రం వేళలో పార్కింగ్ చుట్టూ ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్‌లో పలువురు ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ వాకింగ్, రన్నింగ్ తదితర వ్యాయామలు చేస్తుంటారు. వీరందరూ చెరువులు నుండి వచ్చే దుర్వాసనతో రోగాల బారిన పడుతున్నారని ఆరోపణ వినిపిస్తున్నాయి. చెరువులు లీజుకు తీసుకున్న సొసైటీ సభ్యులే చెరువులో చేపలు పెంపకం చేయవలసి ఉండగా అందుకు విరుద్ధంగా లీజుదారుడు వ్యవహరిస్తున్నా గ్రామపంచాయతీ కార్యదర్శి పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం అల్లూరి సీతారామరాజు పార్కు వాకింగ్ ట్రాక్ చెరువు పరిశుభ్రతపై దృష్టిసారించికోడిపెంట వ్యర్థాలను అరికట్టడంతో పాటు చెరువును సబ్ లీజుకు ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని, మంచినీటి చెరువులా ఉంచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు అన్నదానం- పాల్గొన్న భక్తులు

**పెద్దాపురం, మేజర్ న్యూస్** : పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు ఆదివారం దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారి దర్శనానికి సుదూర ప్రాంతాల నుండి వచ్చు భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, అన్నప్రసాదం స్వీకరించారు. వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది వెంకటరమణ, గౌరి, వరహాలు, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.



# ఉగ్రవాదాన్ని సహించేది లేదు : ఎంపీ పురందేశ్వరి

### –రవిశంకర్ ప్రసాద్ సారధ్యంలో విదేశాలకు అఖిల పక్ష బృందం



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్** : ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లో భారత్ సహించబోదని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి స్పష్టం చేసారు. ఉగ్రవాదంతో అంటకాగుతూ భారత్‌పై విషం చిమ్ముతున్న పాకిస్తాన్ దుర్నీతిని అంతర్జాతీయ వేదికపై ఎండగట్టేందుకు కేంద్రం ఏర్పాటుచేసిన ఏడు అఖిల బృందాలలో ఎంపీ పురందేశ్వరి ప్రాతినిధ్యం వహిస్తున్న బృందం ఆదివారం పారిస్ కి బయలుదేరి వెళ్ళింది. ఉదయం 11గంటలకు ఢిల్లీ నుంచి బయలుదేరిన ఈ బృందం దుబాయ్ మీదుగా రాత్రికి పారిస్ కి చేరుకుంది. ఫ్రాన్స్, యుకె, ఈయూ,ఇటలీ ,డెన్మార్క్, జర్మనీ, దేశాలలో పర్యటించి జూన్ 8వ తేదీన భారత్ కి రానున్న ఈ బృందానికి బిజెపి సీనియర్ నేత, ఎంపీ రవిశంకర్ ప్రసాద్ నాయకత్వం వహిస్తున్నారు. పహల్గాంలో పాకిస్తాన్ ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోవడం, అందుకు ప్రతిగా భారత్ చేపట్టిన ‘ఆపరేషన్ సిందూర్’, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉగ్రవాదం గురించి ఈ బృందం వివరిస్తుంది. ఈ బృందంలో పురందేశ్వరితో పాటు బిజెపి ఎంపీ సామిక్ భట్టాచార్య, శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది, కాంగ్రెస్ ఎంపీ డా. అమర్ సింగ్, నామినేటెడ్ ఎంపీ గులాం అలీ ఖటాన, ఎంజే అక్బర్, పంకజ్ శరన్ ఉన్నారు.

## శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవార్కి బంగారు నత్తు బహుకరణ



**పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్** : పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు ఆదివారం కాకినాడ జిల్లా తుని పట్టణానికి చెందిన బర్ల కృష్ణ గంగరాజు, మాధవి లత దంపతులు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని సుమారు రూ.3,80,000/– విలువ గల బంగారు నత్తు బహుకరించి, మొక్కు తీర్చుకున్నట్లు దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ తెలిపారు. తదుపరి సంప్రోక్షణ అనంతరం ఈ బంగారు నత్తును అమ్మవార్కి అలంకరణ చేయడం జరిగిందని అసిస్టెంట్ కమీషనర్ విజయలక్ష్మీ తెలిపారు. బహుకరించిన దంపతులకు, కుటుంబ సభ్యులకు దేవస్థానం తరపున ఆశీర్వాదం, అమ్మవారి శేషవస్త్రాలు, అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు, ఆలయ ఆసాదులు, అర్చకులు, వేదపండితుల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది వెంకటరమణ, గౌరి, వరహాలు, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌టిఆర్ అపార్ట్‌మెంట్స్‌లో కార్డన్ సెర్చ్

### – పలు వాహనాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు



**పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్**:కాకినాడ జిల్లా ఎస్‌పి బింధుమాధవ్ ఆదేశాలు పెద్దాపురం డిఎస్‌పి డి.శ్రీహరిరాజు సూచనల మేరకు పెద్దాపురం సిఐ విజయశంకర్, ఎస్సై వి.మౌనికల ఆధ్వర్యంలో శనివారం రాత్రి పెద్దాపురం పట్టణంలో ఎన్‌టిఆర్ అపార్ట్‌మెంట్స్‌లో స్పెషల్ పార్టీ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా అనుమానితుల ఇళ్ళ వద్ద ధృవపత్రాలు లేని మోటార్ సైకిల్స్‌లను గుర్తించి, పోలీస్‌స్టేషన్‌కు తరలించడం జరిగిందని ఎస్సై మౌనిక తెలిపారు.ఈ తనిఖీలలో పలువురు పోలీస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు ‘ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ’ నిర్వహణ - ఆర్డీఓ శ్రీరమణి



**పెద్దాపురం,మేజర్‌న్యూస్** : సోమవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహణ జరుగుతుందని, ఆర్డీఓ కె.శ్రీరమణి తెలిపారు. కావున డివిజన్‌లోని 11 మండలాల పరిధిలో గల ప్రజలు ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సద్వినియోగం చేసుకోవలసినదిగా ఆమె తెలిపారు.

# పిఠాపురంలో పోలీసుల కార్డెన్ సెర్చ్

-సరైన పత్రాలు లేని
43 ద్విచక్ర వాహనాలు గుర్తింపు
-15 లీటర్ల నాటు సారా స్వాధీనం
-పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.శ్రీనివాస్



**పిఠాపురం, మేజర్ న్యూస్** : పిఠాపురం స్థానిక జగ్గయ్య చెరువు కాలనీలో... సర్కిల్ ఇన్స్పెక్టర్ జి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో సర్కిల్ ఎస్సైలు వి. మణికుమార్, షేక్ జానీ భాషా, జి. వెంకటేష్, ఎన్. రామకృష్ణతో కలిసి బృందాలుగా ఏర్పడి ఆకస్మిక తనిఖీలు (కార్డెన్ సెర్చ్) నిర్వహించారు. సరైన పత్రాలు లేని 43 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. 15 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ జి. శ్రీనివాస్ మాట్లాడుతూ... కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ వారి ఆదేశాల మేరకు ది. 25 మే 2025 తెల్లవారు జామున పిఠాపురం పట్టణ పరిధిలో గల స్థానిక జగ్గయ్య చెరువు కాలనీ లో పిఠాపురం సర్కిల్ ఎస్ఐలు మరియు సిబ్బందితో కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించి సదరు ఏరియాలో అనుమానితులను తనిఖీ చేసి మరియు వారి వద్ద నుండి సరైన పత్రాలు లేని సుమారు 43 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, 15 లీటర్ల నాటు సారా సీజ్ చేసి కేసు నమోదు చేయడమైనదన్నారు.

జరుగుతున్న పరిణామాల దృష్ట్యా వాహనాలు కాని, ఏదైనా విలువైన వస్తువులకు సంబంధించి తప్పనిసరిగా తమ వద్ద వాహనానికి సంబంధించిన సరైన పత్రాలు కలిగి ఉండాలని, ఎవరైనా కొత్త వ్యక్తులు/అనుమానితులు కనిపించినా... ఏదైనా అసాంఘిక చర్యలు జరిగినా వెను వెంటనే పిఠాపురం పట్టణ పోలీస్ స్టేషన్ వారికి సమాచారం అందించాలని, అదేవిధంగా నివాసం ఉండే ఇంటి యజమానులు, కొత్త వ్యక్తులకు ఎవరికైనా ఇల్లు అద్దెకిచ్చేటప్పుడు వారి యొక్క వివరాలను పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. అద్దెకిచ్చిన తర్వాత కూడా వారు ఎటువంటి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు అనే విషయాలపై దృష్టి సారించాలని గృహ యజమానులను కోరారు. ఈ ఆకస్మిక అతనికి కార్యక్రమంలో.. సర్కిల్ ఎస్సైలు, ఏ ఎస్సైలు, వాచ్సీలు మరియు వారి సిబ్బంది, అదనపు బెటాలియన్ బలగాలు పాల్గొన్నారు.

# కార్యక్రమం విజయవంతానికి సహకరించండి

**కాకినాడ, మేజర్ న్యూస్** : అధ్యక్షులు వాసిరెడ్డి ఏసుదాసు ఆధ్వర్యంలో రఘుపతి వెంకటరత్నం నాయుడు 130వ వర్ధంతిని పురస్కరించుకుని, సోమవారం ఎన్ఎఫ్సిఎల్ రోడ్డు, కమ్మ కళ్యాణమండపం కూడలి సమీపంలో గల వెంకటరత్నం నాయుడు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు, జీవితకాల సభ్యులు, అభిమానులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని కాకినాడ ఆంధ్రా కాపు సద్భావన సంఘం ప్రధాన కార్యదర్శి చిట్నీడి శ్రీనివాసు పిలుపునిచ్చారు.

# పేద విద్యార్థినికి అండగా ఫౌండేషన్



**కాకినాడ, మేజర్‌న్యూస్** : అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ఉన్నత సాంకేతిక విద్య అభ్యసిస్తున్న విద్యార్థినికి నారా లోకేష్ యువజన ఫౌండేషన్ అండగా నిలిచింది. ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు విద్యార్థినికి ఆర్థిక సాయం అందించి ఏ అవసరం వచ్చినా తనను సంప్రదించాలని భరోసా ఇచ్చారు. అలాగే దివంగత మహానేత ఎన్టీఆర్ మనవడు సినీ హీరో నందమూరి చైతన్యకృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అదే విధంగా కాకినాడ రూరల్ వాస్తవ్యులు ఆకుల సత్తిబాబు వెంకటలక్ష్మి వివాహ వార్షికోత్సవ వేడుకలు సందర్భంగా అన్నా ఎన్టీఆర్ జనార్దన్ క్యారేజీ ద్వారా పేదలకు రైస్ బాగ్స్, చికెన్ బిర్యాని పంపిణీ చేశారు. సుబ్బు మాట్లాడతా తెలుగుదేశం పార్టీ పేదలకు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఫౌండేషన్ అధ్యక్షులు మండపాక నాగబాబు, శ్రీధర్, పసుపులేటి సత్యనారాయణ, నాని, పండు పృథ్వి, జోసఫ్, ఫౌండేషన్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గోదావరి భవన్ నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం

**అమలాపురం, మేజర్ న్యూస్** : ఈ నెల 26 వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి స్థానిక కలెక్టరేట్లో గోదావరి భవన్ నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించబడునని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు 1100 కాల్ సెంటర్ ద్వారా తమ ఫిర్యాదుల పరిష్కార స్థితిని తెలుసుకోవచ్చునన్నారు. ఏవైనా సందేహాలు ఉన్నట్లయితే అడగవచ్చునన్నారు. కొత్త ఫిర్యాదులు కూడా నమోదు చేయవచ్చునన్నారు. అర్జీదారుల వద్ద నుండి వినతులను స్వీకరించి వారి యొక్క సమస్యలను ప్రజా సమస్యల పరిష్కార వేదిక యందు నమోదు చేస్తూ వారి సమస్యలకు పరిష్కారం తెలుపబడునని, ప్రజా సౌకర్యార్థం ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక మూడు రెవెన్యూ డివిజన్లు 22 మండల కేంద్రాలు, 4 మున్సిపల్ కార్యాలయాలలో కూడా ఈ కార్యక్రమంనిర్వహించబడుతుందని, కావున అర్జీదారులు ఆయా స్థాయిలలో తమ సమస్యలను నమోదు చేసుకొని పరిష్కారం పొందు దిశగాఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# నేడే రఘుపతి వెంకటరత్నం నాయుడు వర్ధంతి



**కాకినాడ, మేజర్‌న్యూస్** : సోమవారం ఇరవై ఆరవ తేదీన ప్రముఖ సంఘసంస్కర్త రఘుపతి వెంకటరత్నం నాయుడు 87వ వర్ధంతి సందర్భంగా ఉదయం ఎనిమిది గంటలకు కాకినాడ జేయన్టియు సమీపంలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించే కార్యక్రమం ఉంటుందని ఆర్.వి.యన్ స్టడీ సర్కిల్ కన్వీనర్ యన్.గోవిందరాజులు తెలిపారు. ఈ సందర్భంగా అభిమానులు, అభ్యుదయ భావాలు కలిగిన వారు, వివిధ ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. మన కాకినాడ పి.ఆర్.కళాశాలలో ఆయన ప్రిన్సిపాల్‌గా ఉన్న సమయంలో మొట్టమొదటిసారిగా బాలికలకు ప్రవేశం కల్పించిన ఘనత వెంకటరత్నం నాయుడుది అని, కుల మత లింగ వివక్షతలకు వ్యతిరేకంగా కలం, గళం విప్పిన ఘనత వెంకటరత్నం నాయుడుది అని యూటీఎఫ్ నాయకులు ఐ.ప్రసాదరావు విలేకరులతో మాట్లాడుతూ తెలిపారు. ఈనాడు మన పాలకులు ఆశిస్తున్న 2047 నాటికి వికసిత ఆంధ్రప్రదేశ్, వికసిత భారత్ లక్ష్యం సాధించాలంటే మహిళలు భాగస్వామ్యంతోనే సమగ్రాభివృద్ధి సాధ్యం అని గ్రహించాలి,ఇది ఆనాడే ఊహించి మహిళలు అభివృద్ధికి పునాదులు వేసిన ఘనత వెంకటరత్నం నాయుడుదిఅని పలువురు తెలిపారు.ఆమహనీయుడి వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులు అర్పించే ఆవశ్యకత ఎంతైనా ఉంది గ్రహించి అందరూ ఉదయం ఆయన విగ్రహం వద్దకు రావాలని, అక్కడ పలువురు వక్తలు చెప్పే అంశాలను పరిగణనలోకి తీసుకుని అయిన ఆశయాల సాధనకు కృషి చేయాలని తెలిపారు.

# జిల్లాలో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ఏలూరు జిల్లాలో ఎక్కడా బెల్ట్ షాపులు లేకుండా చర్యలుతీసుకున్నామనిజిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆవులయ్య చెప్పారు. ఏలూరు న్యూ అశోక్ నగర్ లోని తమ కార్యాలయంలో పాత్రికేయులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో బెల్టు షాపుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నామని, ఇంతవరకు 456 కేసులు నమోదు చేసి 478 మందిని అరెస్ట్ చేయడంతో పాటు బెల్ట్ షాపులకు మద్యాన్ని సరఫరా చేస్తున్న కుకునూరు, ఏలూరు రూరల్, పెదవేగి మండలం, భీమడోలులలోని ఐదు వైన్ షాపులను సీజ్ చేసి, ఐదు లక్షల రూపాయలు చొప్పున అపరాదరుసుం విధించామన్నారు. జిల్లాలో మొత్తం లైసెన్స్ పొందిన 155 మద్యం షాపులు ఉన్నాయని, మద్యం షాపులలో కచ్చితంగా ఎమ్మార్పీ ధరలకే మద్యం అమ్మేలా చర్యలు తీసుకుంటున్నామని, రాత్రి పది గంటల తర్వాత కొంచెం షాపులో మద్యం అమ్మకుండా విస్తృత తనిఖీలు చేస్తున్నామన్నారు. చింతలపూడి మండలం ఎర్రగుంటపల్లిలో ఎంఆర్పి కన్న అదనంగా మద్యాన్ని అమ్ముతున్న కనకదుర్గ వైన్స్ పై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ఏలూరు జిల్లాను మే, 31 వ తేదీ నాటికి నాటు సారా రహిత జిల్లాగా రూపొందించేందుకు తీసుకుంటున్నామని,జిల్లాలోని 140 గ్రామాలలో నాటు సారా తయారీ తయారీదారులు ఉన్నారని, ఆ గ్రామాలలో దాడులు నిర్వహించి నాటుసార తయారు కాకుండా చర్యలు తీసుకుని, వారికి నవోదయం-2 పథకం ద్వారా ప్రత్యామ్నాయ ఉపాధి కార్యక్రమాలు కల్పిస్తున్నామని చెప్పారు.

ఆ గ్రామంలోని 35 కుటుంబాలకు చెందిన 138 మంది మహిళలకు ఉన్నతి, స్త్రీ నిధి పథకాల ద్వారా వడ్డీ లేని రుణాలు అందించి స్వయం ఉపాధి పథకాలు ఏర్పాటుచేసుకునేలాచర్యలు తీసుకుంటున్నా మన్నారు.

# మంగళవారం రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో యోగాంధ్ర రాష్ట్ర స్థాయి కార్యక్రమం



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్** : జూన్ 21వ తేదీన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని "ఒకే ధరిత్రికి - ఒకే ఆరోగ్యానికి యోగా" (యోగా ఫర్ వన్ ఎర్త్,వన్ హెల్త్) అనే నినాదంతో ప్రతిశాఖ,ప్రతి సంస్థ నందు ప్రతిష్ఠాత్మకంగా యోగా కార్యక్రమాలను నిర్వహించాలన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులననుసరించి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి వారిఆదేశములతో రాజమహేంద్రవరం కేంద్ర కారాగారములో ది. 27.05.2025 మంగళవారం నాడు యోగాసన శిబిరాన్ని ఏర్పాటుచేస్తున్నట్టు కేంద్ర కారాగారము, రాజమహేంద్రవరం పర్యవేక్షణాధికారి ఎస్.రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలియచేసారు. లోకసభ సభ్యురాలు, రాష్ట్ర మంత్రివర్గ సభ్యులు, శాసనసభ సభ్యులు, శాసన మండలి సభ్యులు, ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్,ఇతర శాఖల ఉన్నతాధికారులు, జైళ్ల శాఖ ఉన్నతాధికారులు ఈ కార్యక్రమానికి హాజరు కానున్నట్టు తెలిపారు.

యోగా శిక్షకులచే సుమారు 1300 మంది కారాగార ఆశ్రమవాసులు, అధికారులు, గార్డింగ్ సిబ్బంది, మినిస్టీరియల్ సిబ్బంది సహా సుమారు 1500 మందితో ఉదయం గం. 07.00ల నుండి 08.00 వరకు యోగా కార్యక్రమమును నిర్వహించనున్నట్లు తెలియ చేశారు. ఆదివారం జాయింట్ కలెక్టర్ యస్. చిన్న రాముడు, ఆర్డీవో ఆర్. కృష్ణా నాయక్, కారాగార పర్యవేక్షణాధికారి యస్. రాహుల్ ఆధ్వర్యంలో వేదికను, ఏర్పాట్లను పరిశీలించి, కార్యక్రమ నిర్వహణ గురించి దిశానిర్దేశం చేశారు.

# రాజవొమ్మంగిలో 14 మంది జూదరులు అరెస్ట్




డిఎస్‌పి సాయిప్రశాంత్

## -రూ 1,95,000 నగదు,19 మోటార్ బైకులు స్వాధీనం

**రాజవొమ్మంగి,మేజర్‌న్యూస్ :** మండలంలోని బడదనాంపల్లి పంచాయతీ కిమ్మలగడ్డ గ్రామ శివారు అటవీప్రాంతంలో చిత్తులాట శిభిరంపై పోలీసులు దాడులు నిర్వహించి 14 మంది జూదగాళ్లను అదుపులోకి తీసుకొని వారి వద్దనుండిరూ 1లక్ష 95000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు రంపచోడవరం డిఎస్పి సాయి ప్రశాంత్ వెల్లించారు. అలానే సంఘటన స్థలంలో 19 మోటార్ బైకులను స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పీ తెల్పారు. ఈ సందర్భంగా శనివారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్ వద్దఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో డిఎస్పీ సాయి ప్రశాంత్ మాట్లాడుతూవారికి వచ్చిన సమాచారం మేరకు శనివారం సాయంత్రం రాజవొమ్మంగి సర్కిల్ ఇన్స్పెక్టర్ తో పాటు, అడ్డతీగల సర్కిల్ ఇన్స్పెక్టర్, గంగవరం, అడ్డతీగల,జడ్డంగి సబ్ ఇన్స్పెక్టర్లు, కొంతమంది కానిస్టేబుల్‌తో వెళ్లి చిత్తులాట శిబిరంపై దాడులు నిర్వహించడం జరిగిందని డీఎస్పీ తెలిపారు. గ్యామిలింగ్ జరగడం వల్ల ఈ ప్రాంతాలలో ముఖ్యంగా కూలీనాలి, వ్యవసాయం చేసుకునే అమాయక గిరిజనులు మోసపోవడం జరుగుతుందని కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయన్నారు.. మైదాన ప్రాంతాలనుండి నిర్వాహకులు, ఫైనాన్సర్లు వచ్చి గ్యాంబ్లింగ్‌లు ప్రోత్సహించి వారు లాభ పడుతున్నారన్నారు. ఇంతకు మించిన గ్యాంబ్లింగ్ గతంలో అడ్డతీగల లిమిట్స్ లో జరుగుగా పోలీసులు రైడ్ చేసి పట్టుకోవడం జరిగింది అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఎక్కడ గ్యామిలింగ్ జరిగిన పోలీసులకి సమాచారం ఇస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచిగ్యాంబ్లింగ్ నిర్మూలించడం జరుగుతుందన్నారు. పట్టుబడిన వారందరికీ గ్యాంబ్లింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమో చేయడం జరుగుతుందన్నారు.

రంపచోడవరం డివిజన్‌లో అసాంఘికకార్యకలాపాలపై ఉక్కు పాదం మోపుతామని డిఎస్‌పి హెచ్చరించారు.శనివారం సాయంత్రం జరిగిన పోలీస్ దాడుల్లో 19 మోటార్ బైకులకు14మంది అరెస్ట్‌కాగామరో ఐదుగురు పారిపోయారని త్వరలోనే వారినిపట్టుకొనికేసు నమోదు చేస్తామన్నారు.ఈ దాడులో స్థానిక సిఐ ఎన్ సన్యాసినాయుడు,అడ్డతీగల సిఐ నరసింహమూర్తి, ఎస్ఐ వినోద్, జడ్డంగి, గంగవరం ఎస్ఐలు చినబాబు, వెంకటేష్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# 27న శనీశ్వర జయంతి



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** శనీశ్వర జయంతి సందర్భం గా ఈనెల 27న మంగళ వారం నాడు తైలాభిషేకము తో పాటు పూజా కార్య క్రమాలను నిర్వహిస్తున్నట్లు వేద పురోహితులు యాతగిరి మధ్వేష్ తెలిపారు. ఆరోజు ఉదయం ఏడు గంటల నుండి అభిషేకాధి కార్యక్ర మాలను భక్తుల గోత్ర నామాలతో చేయడం జరుగు తుందని, అదేవిధంగా శని మూల మంత్రాన్ని, జప కార్యక్రమాన్ని కూడా నిర్వహించబడుతుందన్నారు. భక్తులు వారి గోత్రనామాలను 9640662837 వాట్సాప్‌కు పంపించా ల్సిందిగా ఆయన తెలిపారు. ఇతరవివరాలకు 8074053986 లో సంప్రదించ వచ్చని తెలిపారు.

# ఉదయం 7.30 గంటలలోపు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి

**కాకినాడ, మేజర్ న్యూస్ :** కడప జిల్లా పబ్బాపురంలో ఈనెల 27వ తేదీ నుండి 29వ తేదీ వరకు తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృష్ట్యా కడపలోని కందుల ఓబుల్‌రెడ్డి మెమోరియల్ (కెఓఆర్ఎం) కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, అన్నమాచార్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ & సైన్సెస్, కెఎస్ఆర్ఎం కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ మరియు కెఎల్ఎం కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఫర్ ఉమెన్ కళాశాలల్లో ఏపి ఈఏపిసెట్-2025 పరీక్షా కేంద్రాలు కేటాయించబడిన విద్యార్థులు 27వ తేదీ ఉదయం 7.30గంటలలోపు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఏపి ఈఏపిసెట్-2025 ఛైర్మన్ & జెఎన్‌టియుకె ఉపకులపతిప్రొ.సిఎస్ఆర్‌కె.ప్రసాద్ విద్యార్థులకు మరియు తల్లిదండ్రులకు సూచించారు.

ఈ నాలుగు పరీక్షా కేంద్రాలలో ఏపి ఈఏపిసెట్-2025 ప్రవేశ పరీక్ష ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించ నున్న దృష్ట్యా సంబంధిత పరీక్షా కేంద్రాలు కేటాయించబడిన విద్యార్థులు ఏవిధమైన ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కోకుండా, ఒత్తిడికి గురికాకుండా ముందుగానే ఉదయం 7.30గంటల లోపు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఏపి ఈఏపిసెట్- 2025 కన్వీనర్ ప్రొ.వి.వి .సుబ్బారావు విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు.

# వెంకన్న అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం



**ఆత్రేయపురం, మేజర్‌న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి అన్నదాన భవన నిర్మాణానికి ఆదివారం పెదకాకానికి చెందిన కొండ్రగుంట రవి, వర మల్లేశ్వరి దంపతులు రూ. 1,00,116లు విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించారు. డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు, సూపరెంటెంట్ రాంబాబు స్వామివారి చిత్రపటం అందించారు.

# అత్యంత వైభవంగా శ్రీ సత్యదేవుని రథోత్సవం



**అన్నవరం, మేజర్‌న్యూస్ :** కాకినాడ జిల్లా అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి సన్నిధిలో ఆదివారం శ్రీ స్వామివారి రథోత్సవ సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. వచ్చిన భక్తులు టికెట్ తీసుకుని స్వామివారి రథ సేవలో పాల్గొన్నారు. భక్తులు గ్రామస్తులు రథంతోపాటు రాజగోపురం చుట్టూ ప్రదక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ రథోత్సవ సేవలో ఆలయ వేదపండితులు,ఆలయ అర్చకులు,అర్చకులు, దేవస్థానం ఈవో వి.సుబ్బారావు దంపతులు, ఏఈఓ కొండలరావు, పిఆర్ఓ దామోర్ల కృష్ణారావు, ఆలయ సూపరెండెంట్లు సుబ్రహ్మణ్యం, సతీష్, గణపతి, దేవస్థానం అధికారులు భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# దేవాదాయశాఖ ఆధ్వర్యంలో యోగ తరగతులు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** యోగా కార్యక్రమాలలో భాగంగా కాకినాడ జిల్లా, దేవదాయ ధర్మదాయ శాఖ తరపున యోగా గురువులు వేదుల శ్రీకృష్ణ ఫణీంద్ర యోగి, చిట్టూరి చిట్టిబాబుచే దేవదాయ ధర్మదాయ శాఖ ఉప కమిషనర్ డివిల్వి రమేష్ బాబు అధ్యక్షతన ఆదివారం శ్రీ బాలాత్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో యోగా కార్యక్రమం నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలో ఇ.ఇ. దుర్గేష్, స్థపతి శ్రీనివాసాచార్యులు, డి.ఇ. శ్రీనివాస్, డి.ఇ.ఓ. సుబ్బారావు, ఇన్స్పెక్టర్, గ్రంధి నారాయణ రావు, నేమాని సత్యనారాయణ, కార్యనిర్వహణాధికారి వుండవల్లి వీర్రాజు చౌదరి, అర్చకులు, భక్తులు మరియు వివిధ దేవాలయాలకు, సంస్థలకు చెందిన కార్యనిర్వహణాధికార్లు, సిబ్బంది హాజరై సుమారు వంద మందితో శ్రీ బాలాత్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా యోగా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

# పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



– 2005-06 బ్యాచ్ విద్యార్థుల గెట్ టూ గేదర్

– నాటి ఉపాధ్యాయులకు సన్మానం, మధుర జ్ఞాపకాలు జ్ఞప్తి

**ఎటపాక, మేజర్ న్యూస్ :** ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి.. ఇక్కడే కలిసాము.. చదువుల చెట్టు నీడలో అంటూ.... అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం గౌరిదేవిపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2005- 06 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు ఆదివారం ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో స్థిరపడిన వారంతా ఒకేచోటకు చేరుకొని అప్యాయంగా పలకరించుకున్నారు. సభలో కుటుంబ సభ్యులను పరిచయం చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని నిక్‌నేమ్‌లతో పిలుచుకున్నారు. తీపి జ్ఞాపకలను గుర్తు చేసుకొంటూ యోగక్షేమాలను గురించి తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పించిన నాటి గురువులను ప్రత్యేకంగా ఆహ్వానించి వారితో సంభాషించారు. 20ఏళ్ల నాటి విద్యార్థులను చూసిన ఉపాధ్యాయులు తన్మయత్వంతో మునిగిపోయారు. అనంతరం పూర్వ విద్యార్థులు వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసి అందరికీ పరిచయం చేశారు.అనంతరం చదువుతోపాటు సంస్కారం నేర్పిన ఉపాధ్యాయులను పుష్పగుచ్చాలుఅందించి, శాలువాతో సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు.ఈ సందర్భంగా అనాటి ప్రధానోపాధ్యాయుడు బాబురావు మాట్లాడుతూ పిల్లలకు చదువుతో పాటు సంస్కారం అవసరమని, నేడు విద్యావ్యవస్థలో అవి కొరవడుతున్నాయన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యా అవసరమని గుర్తు చేశారు. పిల్లల చదువు పట్ల తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. యువత చెడు వ్యసనాలకు, దురలవాట్లకు దూరంగా ఉండాలని, తద్వారా మంచి పౌరులుగా ఎదగాలన్నారు. ఇరవై ఏళ్ళ తర్వాత కలుసుకున్న విద్యార్థులను అభినందించారు. ఈ బ్యాచ్ వంద శాతం పది ఉత్తీర్ణత సాధించి జిల్లా స్థాయిలో గుర్తింపు తెచ్చారని గుర్తు చేశారు. అనంతరం ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలలో ఉపాధి పొందిన విద్యార్థులు అనుభవాలు పంచుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.